ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 2 డిసెంబరు 2024





తాగునీటి చెరువు

స్వచ్ఛజలం.. అందేనా?

జల్‌జీవన్‌తో..
ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలి. గ్రామీణుల ఆరోగ్యాల్ని పరిరక్షించాలి. 2024 మార్చి కల్లా పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు తాగునీటి పథకాల అభివృద్ధిని విస్మరించింది. దీంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందని ద్రాక్షలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరిగింది. నిధుల కొరతతో బిల్లుల చెల్లింపులు జరగక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారిమళ్లించడంతోనే పనులు ముందుకు సాగలేదు. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే చిట్టచివర స్థానాల్లో ఉన్నాయంటే అధికారుల పనితీరు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఈ పథకం పనులు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.



శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- ముందుకు సాగని జలజీవన్
- గ్రామాల్లో తాగునీటి వెతలు తీవ్రం
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- ప్రతి ఇంటికి అందని ద్రాక్షాలా స్వచ్ఛమైన తాగునీరు
- పథకం అమల్లో రాష్ట్రంలోనే చిట్టచివరన పల్నాడు, బాపట్ల జిల్లాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. ఇంటింటికీ స్వచ్ఛజలాన్ని సరఫరా చేసే సంకల్పంతో 2019లో ఈ పథకం అమల్లోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కష్టంగా మారింది. ప్రస్తుతం ఉన్న నీటి పథకాల ద్వారా ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరు అందుతుంది. జల్‌జీవన్ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాల్సి ఉంది. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ పనులు చేపట్టారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన విషయం తెలిసిందే. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో వైసీపీ పాలకుల తీరుతో లక్ష్యం నీరుగారిపోయింది. జలజీవన్ మిషన్ పథకం పనుల్లో పురోగతి (మిగతా 7వ పేజీలో..)

(మిగతా 7వ పేజీలో..)

కుళాయిలు.. 43.88 శాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,53,251 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే స్వచ్ఛజలం కుళాయిల ద్వారా 43.88 శాతం గృహాలకే అందుతోంది. ఇంకా 5,79,653 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పథకం పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

కుళాయిలు ఇలా..

జిల్లా	గృహాలు	కుళాయిలున్న ఇళ్లు	లేని ఇళ్లు
పల్నాడు	4,34,399	1,47,166	2,87,233
గుంటూరు	2,33,717	1,57,724	75,993
బాపట్ల	3,64,788	1,48,361	2,16,427

పల్నాడు 26వ స్థానం

పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 89,000 కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. జిల్లాలో ఇంకా 2,87,233 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. అంటే 33.88 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గుర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 219 పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు.



నరసరావుపేటలో ఉపాధ్యాయులు చేపట్టిన మహా ప్రదర్శన

ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం

- తల్లిదండ్రుల తర్వాత టీచర్లే రోల్‌మోడల్
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. యూటీఎఫ్ పల్నాడు జిల్లా స్థాయి స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగాయి. జాతీయ పతాకం, ఎస్టీఎఫ్ఐ, యూటీఎఫ్ పతాకాల ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, చివరకు మద్యం షాపుల వద్ద కూడా పనిచేయాల్సి వచ్చిందన్నారు. ఏ ప్రభుత్వాన్నైనా గద్దెదించే దమ్ము, ధైర్యం ఉపాధ్యాయులకు ఉందన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిస్తే బాగుంటుందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలుకి సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తర్వాత ఉపాధ్యాయులే విద్యార్థులకు రోల్‌మోడల్ అన్నారు. చంద్రబాబునాయుడికి ఉన్న నీతి, నిజాయితీ, నడవడిక చాలా గొప్పదన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, విద్యారంగంలో పల్నాడు జిల్లా వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో అక్షరాస్యత తక్కువగా ఉందన్నారు. పల్నాడులో ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలన్నారు. పల్నాడు పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువ, ఉపాధ్యాయులు తక్కువన్నారు. పల్నాడులో విద్యారంగ అభివృద్ధికి యూటీఎఫ్ ఒక ప్రణాళిక తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో ఉపాధ్యాయుల మహా ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కడియాల రమేష్‌బాబు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ టీఎస్ ఎల్ఎన్ మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్‌తోపాటు ఎం హనుమంతరావు, ఎస్ తాండవకృష్ణ, జీ ప్రభుదాస్, సీఐటీయు జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ ఆంజనేయనాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే విజయకమల, కౌన్సిలర్ ఎస్ సుందరావు, జిల్లా సహాధ్యక్షుడు ఎం మోహనరావు, ప్రధాన కార్యదర్శి జీ విజయసారథి, ఏ భాగేశ్వరిదేవి, కే శ్రీనివాసరెడ్డి, జే వాల్యానాయక్, ఎస్‌కే జమాల్, కే తిరుపతి స్వామి, టీ వెంకటేశ్వర్లు, షేక్ అయేషాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న వీరాచారవంతులు



కన్నమదాసు భైరవ ఖడ్గాన్ని చేబూనిన ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

7

మిర్చి వ్యాపారి అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు

ముగిసిన పల్నాడు జిల్లా పోలీస్ క్రీడోత్సవాలు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఐసీయూకు తాళాలు

- రోగులకు అందని క్లిష్టతర వైద్యం
- మొక్కుబడిగా నరసరావుపేట ఆస్పత్రి నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నరసరావుపేట ఏరియా వైద్యశాలను ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తోంది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో విఫలమైంది. మందులు.. సిబ్బంది కొరత రోగులను వేధిస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్న ఈ వైద్యశాలపై వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. అత్యవసర.. క్లిష్టమైన సంరక్షణ చికిత్సలు రోగులకు అందుబాటులో లేవు. పది పడకలతో ఐసీయూని ఏర్పాటు చేశారు. అయితే అది ప్రారంభానికి నోచుకోవడం లేదు. వైద్యులు.. సిబ్బందిని నియమించలేదు. దీంతో తాళాలతో ఐసీయూ ఉంది. క్లిష్టమైన చికిత్సల కోసం రోగులను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక రోగులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకున్నాయి. సిబ్బంది నియామకం జరిగే వరకు నరసరావుపేట ఆస్పత్రిలో ఐసీయూ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కానరావడంలేదు. ఆస్పత్రి నిర్వహణపై పాలకులకు చిత్తశుద్ధి లేదని ఇక్కడ నెలకున్న పరిస్థితులు తెలియజేస్తున్నాయి. రోజూ వందలాది మంది రోగులు వస్తున్నా ఆస్పత్రిలో మందుల సరఫరా అంతంతమాత్రమే. వైద్యులు రాసిచ్చే మందులను తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ షాపులో కొనుగోలు చేస్తున్నారు.



నరసరావుపేట ఆస్పత్రిలో తాళాలు వేసి ఉన్న ఐసీయూ

రెండున్నరేళ్లైనా.. తప్పటడుగులే

- జిల్లా కేంద్రంలో ఇంకా అరకొర వసతులే
- ఇరుకు గదుల్లోనే పలు జిల్లా కార్యాలయాలు
- కార్యాలయాల్లో సిబ్బందికి.. ఫర్నిచర్‌కూ కొరతే
- ప్రైవేటు భవనాల్లోనే పలు శాఖల కార్యాలయాలు
- ప్రతిపాదనల దశలోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పరిపాలనా సౌలభ్యం పేరుతో లోక్‌సభ్ నియోజకవర్గాల ప్రాతిపదికగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన జరిగి రెండున్నరేళ్లు అవుతుంది. అయితే ఇంకా తప్పటడుగుల్లోనే జిల్లా పరిపాలన సాగుతోంది. పూర్తి స్థాయిలో ఇంకా కార్యకలాపాలు జరగడం లేదు. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలు జరుగుతున్న పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా జిల్లా ఏర్పాటుకు పూనుకుందే తప్ప పాటించాల్సిన నిబంధనలను పట్టించుకోలేదు. జిల్లా ఆవిర్భావం సమయంలోనే ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అలాంటి ప్రయత్నమేమీ జరగలేదు. దీంతో ఏ ఒక్క కార్యాలయంలోనూ కనీస సదుపాయాలు, ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడంతో అరకొర వనరులతోనే కార్యాలయాలను నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో కార్యాలయాలు ఉన్నా కొందరు అధికారులు, ఉద్యోగులు ఇంకా గుంటూరు నుంచే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాల్లో వసతులు లేక ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో కొన్ని కార్యాలయాలు ఏర్పాటు కాగా ప్రభుత్వం నిర్ణయించిన అద్దె సరిపోక అధికారులు సొంతంగా చెల్లించాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. రెండున్నరేళ్లు గడిచినా బాలారిష్టాలను దాటలేదు. పల్నాడు జిల్లాకు సంబంధించి నరసరావుపేట కేంద్రంగా పూర్తి స్థాయిలో కార్యాకలాపాలు జరగడం లేదు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, వారి నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని ప్రధాన కార్యాలయాలకు నేటికీ కూడా కనీసం ఫర్నిచర్ సరఫరా చేయలేదు. కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల నియామకాలు జరగలేదు. ఒక్కొక్క అధికారి రెండు పోస్టులను నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల పోస్టులను మంజూరు చేసిన గత ప్రభుత్వం నియామకాలను విస్మరించింది. ఇంజనీరింగ్ శాఖల్లో ఈఈ స్థాయి అధికారే ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఏపీడీలే పీడీలుగా పనిచేస్తున్నారు. డీఎల్‌పీవోనే డీపీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ ఉద్యోగానికి న్యాయం చేయలేక పోతున్నారు. కొందరు అధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నా ఇంకా గుంటూరులోని ప్రధాన కార్యాలయాల నుంచే జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ఆయా శాఖల కార్యాలయాలు, అధికారులు, ఉద్యోగులు అందుబాటులో లేక ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు స్థలంతో సరి..

నరసరావుపేటలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం అంటూ జిల్లా ఏర్పడిన కొత్తలో హడావిడి చేసిన గత ప్రభుత్వం ఆ తర్వాత దాని ఊసే మరిచింది. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ఆమోదం తెలిపిన ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుతం కలెక్టరేట్ ఉన్న ప్రాంతంలోనే 25 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇక్కడ కలెక్టరేట్‌తో పాటు అన్ని శాఖల కార్యాలయాలు నిర్మించాల్సి ఉంది. ఏడు ఎకరాలు జిల్లా పోలీసు ప్రాంగణానికి కేటాయించారు. రూ.100 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారే కానీ అది ముందుకు సాగలేదు. రెండున్నరేళ్ల నుంచి వెంటాడుతున్న బాలారిష్టాలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం దొరుకుతుందని పలువురు ఆశ పెట్టుకున్నారు. కానీ ఇటీవల జరిగిన బదిలీల్లో సిబ్బంది నియామకం దగ్గర నుంచి జిల్లా అధికారుల పోస్టుల వరకు పాత తంతే నడవడం నిరాశపర్చింది.



కమ్యూనిటీ హాల్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయం



శిథిల భవనంలో జిల్లా సరఫరా అధికారి కార్యాలయం



విలేజ్ క్లినిక్ భవనంలో వ్యవసాయ కార్యాలయం ఏర్పాటుతో ఆరుబయటే విధులు నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

ఎమ్మెల్సీ ఓటు ఉందా.. లేదా?

- సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో తెలుసుకునే సౌలభ్యం
- ఒకవేళ లేకుంటే మళ్లీ క్లెయిమ్ చేసుకునే అవకాశం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి త్వరలో జరగనున్న ఎన్నిక కోసం ముసాయిదా ఓటర్ల జాబితాలు అంతర్జాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఆరు జిల్లాల నుంచి అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని క్షేత్ర పరిశీలన జరిపిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అన్నీ సవ్యంగా ఉన్న వాటిని ఆమోదించారు. సర్టిఫికెట్లు సరిగా పొందుపరచిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. అర్హులకు ఓటుహక్కు కల్పించిన జాబితాలను జిల్లాల వారీగా సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పట్టభద్రుడికి ఓటు మంజూరైందో, లేదో తెలుసుకునే సదుపాయం ఈ వెబ్‌సైట్‌లో కల్పించారు. అర్హత ఉండి ఎవరికైనా ఓటు రాకపోయినా, ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయినా ప్రస్తుతం జరుగుతున్న క్లెయిమ్‌లు/అభ్యంతరాల స్వీకారం సందర్భంగా అందజేయొచ్చని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.



ఇలా తెలుసుకోచ్చు...

తొలుత సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ని వెబ్‌బ్రౌజర్ నుంచి తెరవాలి. అందులో ఎంఎల్‌సీ ఈ రిజిస్ట్రేషన్ -2024లోకి వెళ్లి ట్రాక్ యువర్ అప్లికేషన్ స్టేటస్‌ని మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో గ్రాడ్యుయేట్ అనే ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. అప్లికేషన్ ఐడీ/ దరఖాస్తు దారుడి పేరు/ ఇంటి నంబరులో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని ఆ వివరాలను ఎంటర్ సెర్చ్ వాల్యూలో పొందుపరిచి సెర్చ్‌ని క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని అందులో ఏపీపీ ఐడీ, సబ్మిషన్ డేట్, పీఎస్ నంబరు. ఎస్ఎల్ నంబరు, పేరు, రిలేషన్ నేమ్, హౌస్ నంబరు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వో కామెంట్స్, ఏపీపీ స్టేటస్ వివరాలు ప్రత్యక్షమౌ తాయి. అందులో ఏపీపీ స్టేటస్‌లో యాక్సెప్టెడ్ అని ఉంటే మీ ఓటు నమోదైనట్లే. అప్పుడు పీఎస్ నంబరు, సీరియల్ నంబరుని ఒక పేపర్ మీద రాసుకోవాలి. ఆ తర్వాత విండోని మూసేసి హోం పేజీకి వెళ్లి ఎలక్టోరల్ రోల్స్‌లో మెనూ ఏపీ ఎమ్మెల్సీ టీచర్స్, గ్రాడ్యుయేట్ రోల్స్-2024పై మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని ఈస్టు-వెస్టు గోదావరి అండ్ కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల డ్రాఫ్టు రోల్స్-2024ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. దాంతో మరో విండో తెరుచుకుంటుంది. అందులో సెలెక్ట్ కాన్‌స్టిట్యూయెన్సీ డ్రాప్‌డౌన్ మెనూలో 3 నంబరులో ఉన్న కృష్ణా - గుంటూరుని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత పక్కనే జిల్లాని ఎంపిక చేసుకోవాలి. అనంతరం గెట్ పోలింగ్ స్టేషన్స్ అనే దానిపై క్లిక్ చేస్తే పోలింగ్ స్టేషన్ నంబరు, పేరు, లొకేషన్ జాబితా తెరుచుకుంటుంది. ఆ తర్వాత ఇంతకుముందు కాగితం మీద రాసుకున్న పోలింగ్‌స్టేషన్‌ని శోధించి వ్యూ మీద క్లిక్ చేస్తే మరో విండో తెరుచుకుని వెరిఫికేషన్ కోడ్‌ని అక్కడ ఉన్నది యథాతథంగా ఎంటర్ చేయమని చెబుతుంది. ఆ కోడ్‌ని ఎంటర్ చేసి సబ్‌మిట్ కొట్టగానే ఓటర్ జాబితా డౌన్‌లోడ్ అవుతుంది. అందులో సీరియల్ నంబరు చూసుకుంటే ఓటు ఉన్నది, లేనిది తెలిసిపోతుంది.

ఓటు లేకపోతే...

ఒకవేళ ముసాయిదా ఓటర్ జాబితాలో పేరు లేకపోతే మళ్లీ ఓటుహక్కు కోసం క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సదుపాయం అందుబాటులో ఉన్నది. డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు గడువు తేదీ ఉన్నది. ఆ తర్వాత క్లెయిమ్‌లను పరిష్కరించి డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు. కాగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన పట్టభద్రులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు అయ్యే అవకాశం ఉన్నది.

ఆంధ్రజ్యోతి
నవ్య 6
కుటుంబ కదంబం
సోమవారం • 2 డిసెంబరు 2024

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రొలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రొలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...



విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.

రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రోటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

కళ

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు.

వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు.

అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



సుస్వర సంగీత ఝరి

"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మే పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయోలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోలెడ్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు.



అమ్మవల్లే ఇక్కడివరకు...

సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది.

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయొలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవికాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మలయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్ఫై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా

కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

● ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

● తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

● తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


● ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

● దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

● ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

● వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

● బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

● నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.


ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

\- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.


నవ్య | చిత్రజ్యోతి

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుశ్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుశ్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుశ్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుశ్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి


ర్యాలీ చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంటూరు(విద్య), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, వేధింపులతో మరణించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హైకోర్టులోప్రభుత్వమే అప్పీల్ దాఖలు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. రిషితేశ్వరికి న్యాయం చేయాలని కోరుతూ నగరంలో ఆదివారం బ్రాడీపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయం నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ రిషితేశ్వరి ర్యాగింగ్ తట్టుకోలేక హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిందని, సూసైడ్ నోట్ ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా పేర్కొన్నా న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. సీనియర్ విద్యార్థుల వేధింపులు, వర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే రిషితేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తొమ్మిది సంవత్సరాలపాటు న్యాయస్థానంలో విచారణ జరిగినా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అనూరాధ, స్వాతి, బాష, రమణ, పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఎస్కే సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సురేంద్ర, సుభాని, షంషీర్, శివాజీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


రెడ్డిపాలెంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్ జాకోబ్‌రెడ్డి

బొల్లాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను రెవరెండ్ ఫాదర్ యన్నం జాకోబ్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.20,116 శ్రీ చక్రసిమెంట్ వారి సహకారంతో, ద్వితీయ బహుమతి రూ.15,116 శివ శక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సహకారంతో, ద్వితీయ బహుమతి రూ.12,116 అవుకు శివ ప్రసాదు బయో విංజన్ ఫార్మా కంపెనీ సౌజన్యంతో, నాలుగో బహుమతి రూ.7,116 రెడ్డిపాలెం ఎంప్లాయిస్ యూనియన్ వారి సహకారంతో జరుగుతుందన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి


కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో కొండకు చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షం సందర్శించారు. అనుపులోని యాంపీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ. 48 వేల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ మృతి


మృతుడు చిన్న నరసింహారావు (ఫైల్)

రాజుపాలెం, పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన చిలక చిన్న నరసింహారావు(57) పిడుగురాళ్ల నుంచి కొండమోడు జంక్షన్లోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో గుంటూరు వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న లారీ అతి వేగంతో వస్తూ ఢీకొట్టింది. ఈ సంఘటనలో చిలక చిన్న నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిడుగురాళ్లకు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిలక చిన్న నరసింహారావు 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్‌గా కొనసాగారు.

వైభవంగా వీరారాధన ఉత్సవాలు

- పల్నాటి యుద్ధంపై కథాగానం
- ఘనంగా గ్రామోత్సవం
- ఆయుధాలను తిలకించిన ప్రజాప్రతినిధులు


ప్రథమ స్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

కారంపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రాజులు అలరాజును రాయబారిగా గురజాలకు పంపడం, అది సహించని నాగమ్మ చర్లగుడిపాడు వద్ద అలరాజుపై విషప్రయోగం చేయించి హతమార్చి పల్నాటి యుద్ధంకు శ్రీకారం చుట్టింది. ఈ సంఘటనను కథాగానం చేశారు. వీరారాధన ఉత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. వీరాచారవంతులు ఆనాటి ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేసి వాటిని అలంకరించి నూతన వస్త్రాలు ధరింపజేసి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. వీర్ల దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చెన్నకేశవస్వామి ఆలయం, బ్రహ్మనాయుడు విగ్రహం, అంకాళమ్మ ఆలయం చోట్ల కత్తిసేవ చేసి పీఠాధిపతి ఇంటి వద్ద ప్రదర్శన నిర్వహించారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఆవేశంతో ఊగిపోతున్న వీరాచారవంతులకు తీర్థమిచ్చి శాంతింపజేశారు. పీఠాధిపతి వీర్లదేవాలయంలోని మండపంలో ఆశీనులు కాగా వీరవిద్యావంతులు రాయబారం ఘట్టాన్ని గానం చేశారు.

ప్రత్యేక పూజల్లో ఎంపీ, ఎమ్మెల్యే

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పిడుగురాళ్ల పట్టణ ప్రముఖ వైద్యుడు, టీడీపీ నేత ఉన్నం మల్లికార్జునరావు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా వీరుల దేవాలయంలో వీరుల ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. కన్నమదాసు భైరవఖడ్గాన్ని చేతబూనారు. అలాగే చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కూటమి నేతలు భారీ ర్యాలీతో వారికి ఘనస్వాగతం పలికారు.

బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకుని స్థానికంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం సేద్యపు విభాగం పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా, సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీ ఎడ్లజత నిర్ణీత సమయంలో పండెపు బండను 4200 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 4159.8 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, తెలంగాణ జిల్లా మేళ్ల చెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలేష్‌రెడ్డి సంయుక్త ఎడ్లజత 4053.6 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. అనంతరం విజేత ఎడ్లజతల యజమానులకు బహుమతులు అందజేశారు. సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు నాగారపు రామకృష్ణ, బొమ్మిన శ్రీను, పలిశెట్టి హనుమంతురావు, బొమ్మిన శేషగిరిరావు, చింతపల్లి రామ్మూర్తి తెలిపారు.

పుల్లడిగుంటలో అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న రామ్‌చౌదరి కుటుంబ సభ్యులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని స్వగ్రామమైన పుల్లడిగుంటలో తన తల్లి ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జయంతిని పురస్కరించుకొని ఆదివారం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. రామ్‌చౌదరి తండ్రి ఉప్పుటూరి శ్రీరాములు నేతృత్వంలో తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, తానా ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్న క్యాంటిన్ ద్వారా భోజనాన్ని దగ్గరుండి వడ్డించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే స్ఫూర్తితో తన తల్లి పేరుతో గ్రామంలో ప్రజలకు భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంపై పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, అశోక్ కొల్లా, వెంకట్ జిల్లెలమూడి, శ్రీరామన్నారాయణ పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో భోజనానికి క్యూ

స్వచ్ఛజలం.. అందేనా?

(5 పేజీ తరువాయి)

కొరవడింది. పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉండగా ఇంకా 2,29,067 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 33.88 శాతంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గుర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలకు 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టగా 223 పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలకు 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతంతో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పనుల్లో కదలిక కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

నూరు శాతం గ్రామాలివే..

- పల్నాడు జిల్లాలో కేవలం 14 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అమరావతి మండల జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లివారిపాలెం, పోతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో పది గ్రామాల్లోనే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రు, ఇంకొల్లు మండలం బీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామాల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లా పరిధిలో చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కర్నూతల, వట్టిచెరుకూరు, యామర్రులోని అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

గుంటూరు లోక్‌సభ పరిధిలో పచ్చదనాన్ని నింపుతాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


మొక్కలకు నీరు పోస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ వ్యాప్తంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించేలా పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సీసీఎల్ కాంటినెంట్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ సహకారంతో పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం తొలి అడుగు బుర్రిపాలెం గ్రామం నుంచి ప్రారంభించామన్నారు. రోడ్లకు ఇరువైపులా అందమైన చెట్లు ఉండేలా మొక్కలు నాటుతున్నామన్నారు. తొలి దశలో భాగంగా 300 మొక్కలను నాటుతున్నామని గుంటూరు పార్లమెంట్ వ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా కొన్ని వేల మొక్కలు నాటబోతున్నామన్నారు. సీసీఎల్ ప్రాజెక్ట్ తరుపున కాంటినెంటల్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి సహకరిస్తూ ఏడాదికి రూ.50 లక్షల చొప్పున ఐదేళ్లలో రూ.2.50 కోట్లు అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్ఆర్‌జీఏస్ పథకం ద్వారా మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, కృష్ణ - గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజల కోసం తపించే నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐశ్వర్య దీపోత్సవం అజ్ఞానాన్ని తొలిగిస్తుంది

- తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి


కార్తీక ఐశ్వర్య జ్వాలాదీపంకు నమస్కరిస్తున్న పీఠాధిపతులు శివస్వామి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య రోజు దీపం వెలిగిస్తే 30 రోజుల పుణ్యం వస్తుందని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి బోధించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వెల్లంపల్లి సత్యనారాయణ, వాసవి సేవా సమితుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బాపట్ల పట్టణంలోని రథం బజారులో కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆధ్యాత్మికవేత్త బి.బాబునాగేంద్ర పర్యవేక్షించగా శివస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ 12 మాసాలలో కార్తీక మాసం అగ్రస్థానంలో ఉంటుందన్నారు. ఈ మాసంలో దీపం వెలిగిస్తే ఎంతో పుణ్యం వస్తుందన్నారు. నెలలో ఒక్కరోజు కూడా దీపం వెలిగించనివారు చివరి రోజు అమావాస్య నాడు దీపం వెలిగిస్తే నెలరోజుల పుణ్యఫలం వస్తుందన్నారు. కార్తీక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం వల్ల అజ్ఞానం తొలిగిపోయి జ్ఞానం పెంపొందుతుందన్నారు. ప్రజలంతా సుభిక్షంగా, సుసంపన్నంగా ఉండాలని ఆకాంక్షించారు. 7 కోట్ల మహామంత్రాల విశిష్టతను వివరించారు. భక్తులతో మంత్రాలు చెప్పించారు. అనంతరం కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవాన్ని వెలిగించి భక్తులతో పూజలు చేయించారు.

- భావదేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

భావపురి పట్టణానికే తలమానికంగా ఉన్న భావదేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బెల్లంకొండ సత్యనారాయణ, సోమరౌతు నాగభూషణం, మామిడి రమేష్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఉమామహేశ్వరుల పల్లకిసేవ, గోదూళి, శాంతి మంత్రం, ప్రసాద వితరణ జరిగింది.


బాపట్ల రథం బజారులో కిక్కిరిసిన భక్తజనం

మిర్చి వ్యాపారి అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు


నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జీఏంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఎగుమతిదారులు, రైతులను మోసగించిన కమీషన్ వ్యాపారిపై నల్లపాడు పోలీసులకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(జీఏఎంసీ) అధికారులు ఫిర్యాదు చేశారు. యార్డులో 2023-28 సంవత్సరాలకు గోపు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి శ్రీవిజయ భాస్కర్ ట్రేడర్స్ పేరుతో కమీషన్ ఏజంట్ లైసెన్స్‌ని పొందారు. అయితే అతను పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన రంగనాధుల హరిబాబుకు చెందిన 200 మిర్చి బస్తాలు అమ్మి రూ.16,59,605 చెల్లించలేదు. అలానే మరో రైతు రంగనాధుల రామారావుకు చెందిన 300 బస్తాలు రూ.33,76,074 అమ్మి ఆ మొత్తాన్ని కూడా చెల్లించలేదు. మరోవైపు మిర్చి ఎగుమతిదారులకు తాను రైతులతో మిరపకాయలను ఇప్పిస్తానని చెప్పి వేల్ మురుగన్ అండ్ కో, శ్రీలీలా కృష్ణ ట్రేడర్స్, శ్రీగణపతి చిల్లీస్ ట్రేడర్స్ వద్ద రూ. 95 లక్షల లెటర్‌ప్యాడ్‌ల ద్వారా తీసుకొన్నారు. ఈ మేరకు అటు రైతులు, ఇటు ఎగుమతిదారులు జీఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులుకు ఫిర్యాదు చేయడంతో ఇప్పటికే గోపు శ్రీనివాసరెడ్డికి చెందిన లైసెన్సుని ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని నోటీసు ఇచ్చారు. మరోవైపు నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు సెక్రెటరీ తెలిపారు. శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన భాగాస్వామి కిషోర్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

కొత్తూరు ఇక్కత్‌కు ఏఐ సాంకేతికత

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో ఇక్కత్‌కు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) జోడించే అవకాశాలు ఉన్నాయని దక్షిణ భారత కేంద్ర హస్తకళల సంస్థ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు అన్నారు. కొత్తూరు గ్రామంలోని వీవర్స్ కాలనీలో ఆదివారం ఇక్కత్ హస్తకళాకారులకు మూడు నెలల శిక్షణతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. వినియోగదారులు ఏ తరహా చీరలను, డ్రెస్ మెటీరియల్స్‌ను ఆదరిస్తారో తెలిపే ఏఐ సాంకేతికత కేవలం చెన్నై నిఫ్ట్ సంస్థలో మాత్రమే ఉందని, వారిని కొత్తూరుకు తీసుకొస్తామని చెప్పారు. ఏపీలో ఇక్కత్ క్లస్టర్ కొత్తూరలో మాత్రమే ఉందని, దీనికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ హస్తకళా సేవా కేంద్రం రవీంద్రగౌతం, అపిట్కో సీనియర్ కన్సల్టెంట్ ఐ.శ్రీనివాసరావు, పి.సుధీర్‌కుమార్, ఇండిపెండెంట్ జర్నలిస్టు పున్నా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక బాపట్లలో ప్రత్యక్షం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్ నుంచి శనివారం అర్ధరాత్రి అదృశ్యమైన బాలిక (13) ఆదివారం బాపట్ల జిల్లా కొరిశపాడులో ప్రత్యక్షమైంది. ఈ విషయాన్ని ఆదివారం సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నెల్లూరు జిల్లా బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన తిరువీధుల సురేష్, చెంచుకుమారిల కుమార్తె కారుణ్యకు మూగ, చెవుడు. ఈ బాలిక గత ఏడాది నుంచి ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. ఈ క్రమంలో 2నెలలుగా ఆ బాలికకు ఆరోగ్యం బాగులేకపోవడంతో తల్లి తీసుకెళ్లింది. శనివారం సాయంత్రం స్కూలుకు తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్లింది. అదే రాత్రి బాలిక గోడదూకి వెళ్లిపోయిందని హాస్టల్ నిర్వాహకులు బుచ్చి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వేకువజామున 3గంటలకు బాలిక తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో వారు బాలిక ఆచూకీ కోసం బంధువులకు సమాచారమిచ్చి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. హాస్టల్ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి 7గంటలకు బాలిక బాపట్ల జిల్లా కొరిసిపాడులోని తన పిన్నమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు సీఐ శ్రీనావాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. కాగా హాస్టల్‌లో ఓ ఆయా తరచూ కొడుతూ వేధిస్తుంటుందని, అందువల్లే తమ బిడ్డ వెళ్లిపోయిందని తల్లి చెంచుకుమారి ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యాచార ఘటనపై పోక్సో కేసు నమోదు

బాపట్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచార ఘటనలో ఓ వ్యక్తిపై బాపట్ల రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాపట్ల రూరల్ సీఐ గంగాధర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలానికి చెందిన 17 సంవత్సరాల బాలికను దేవరకొండపాలేనికి చెందిన కాగిత వినయ్‌కుమార్ కొన్ని రోజుల క్రితం మాయమాటలు చెప్పి సూర్యలంకకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాగిత వినయ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు

తెనాలి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కొలకలూరు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలికను వరుసకు మేనమామ అయ్యే వ్యక్తి తరుచూ అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో బాలిక కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులను ఆశ్రయించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

నరసరావుపేట లీగల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో రెండు రోజులు పాటు నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీస్ వార్షిక క్రీడోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. టగ్ ఆఫ్ వార్‌లోఎస్పీ జట్టు విజయం సాధించింది. ఫైనల్ పోటీలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పరిపాలన అదనపు ఎస్పీ జైవీ సంతోష్ , ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేవీడీ రామారావు జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు ఆర్ఎస్ఐలు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోంగార్డు, రైతుకు తీవ్ర గాయాలు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో హోంగార్డు, రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పడమటి లలిత్‌బాబు వేమూరు పోలీస్‌స్టేషన్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రామశివారులో పొలాలు పరిశీలించి వస్తున్న సంకటి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయ పడ్డారు. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 587.90 అడుగులు ఉంది. ఇది 306.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9104 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 16,385 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,385 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 41.69 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ఎగువ నుంచి 3500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111.119.130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

ప్రత్యేక విద్యా బోధన ఖాళీలను భర్తీ చేయాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ 2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోటమరాజు, ఎం వెంకట నాయుడు, శిరీష, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చాపకూడు..'

● హాజరుకానున్న ప్రముఖులు

కారంపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారంపూడి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం చాపకూడు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్రవర్మ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొననున్నట్లు కూటమి నేతలు తెలిపారు. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై చాపకూడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

దుర్గిలో నగర సంకీర్తన

దుర్గి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో కార్తీక మాసం పురస్కరించుకొని నెలరోజులుగా నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు తిరుమల వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యాన మాలధారులు ఉదయాన్నే భక్తీ గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు.

సత్రశాల హుండీ ఆదాయం
రూ.85,600

రెంటచింతల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాట ప్రముఖ శైవ క్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయం నెల రోజుల్లో రూ.85,600 వచ్చినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, పూజారి శర్మలు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అభిషేకాలు, దర్శనాలు, అన్నప్రాశన, శాంతి హోమాలు, శీఘ్రదర్శనాల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.

అన్నదానం

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) స్థానిక కుసుమ హరనాథబాబా దేవాలయం వద్ద ఆదివారం పట్టణానికి చెందిన భవనాశి నరసింహారావు కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించి దేవాలయంలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భవనాశి సంపూర్ణ, చంద్రశేఖర్, కొల్లా హేమంత్ కుమార్, చూడామణి, కొల్లా సాయిలోకేష్, కొత్త కోటి హనుమంతరావు, వీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధికి విరాళం

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగమ్మతల్లి దేవాలయం సింహద్వారం ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్ 3 లక్షల 50 వేల 116 రూపాయలను ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కొక్కెర కొండలుకు అందజేశారు.

కోటి దీపోత్సవం.. స్థానిక గంగమ్మతల్లి దేవాలయంలో కార్తీక మాస ముగింపు సందర్భంగా కోటి దీపోత్సవం జరిగింది. పట్టణానికి చెందిన మహిళా భక్తులు ప్రత్యేక పూజలు, దీపాలు వెలిగించే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో
కుటుంబానికి భద్రత

నకరికల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుంకలగుంటలో ఆదివారం రాత్రి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ యువ నేత డాక్టర్ సింగరాయి సాయికృష్ణ నిర్వహించారు. టీడీపీ సభ్యత్వం ద్వారా కుటుంబాలకు భద్రత చేకూరుతుందన్నారు. ప్రజలకు మంచి చేసే టీడీపీని బల పరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల సుబ్బయ్య, రుసుం కోటయ్య, మణికంఠ, సింగరాజు అంకారావు, గోపు శ్రీనివాసరావు, అడపా ఆదెయ్య, పూల మస్తాన్‌రావు, పద్మ, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా నకరికల్లులో టీడీపీ లీగల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బత్తిన గంగయ్య, నాగరాజు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రమాదేవి, ఎంఎస్ భువనేశ్వరన్

విద్యాబోధనలో
క్రియేటివ్ మార్గాలు

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానం, బోధనలో అవసరమైన కొత్త ఇన్నోవేటివ్, క్రియేటివ్ మార్గాలు అవలంబించే ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో కీలకమైన పాత్ర పోషిస్తారని భారతీయ విద్యాభవన్ ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. ఆదివారం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో సీబీఎస్ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్, హ్యాపీ క్లాస్ రూమ్ అనే అంశంపై ఉపాధ్యాయ బృందానికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విలువైన సూచనలు పొందినప్పుడు, ఉత్తమ మార్గదర్శకాలను అందిపుచ్చుకున్నప్పుడు ఉత్తమ బోధనకు కొత్తమార్గాలను అన్వేషిస్తారని, తర్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతారని అన్నారు. విజయవాడకు చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంఎస్ భువనేశ్వరన్, పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డిలు మాట్లాడుతూ విద్యారంగంలో నూతన అవకాశాలకు మార్గదర్శకమని తెలిపారు.

బ్యూటిఫికేషన్ నిధులు
బొక్కేశారు !

● కోటిన్నర పనికి రూ.20 లక్షలతో సరిచేశారు

● వైసీపీ హయాంలో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి నిధులు పక్కదారి

జమ్ము, నాచుతో నిండివున్న పిడుగురాళ్ల చెరువు



చెరువు చుట్టూ పెన్సింగ్ తీగ లేకుండా పాతిన ఇనుప రాడ్లు



పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2018-19 కాలంలో పిడుగురాళ్ల వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి రూ. కోటి 75 లక్షల వరకు మంజూరు చేసింది. ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆ నిధులతో పిడుగురాళ్ల వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు జరిగాయి. అయితే ఆయా పనులకు పూర్తిగా నిధులు ఖర్చుచేయకుండా పనులను తూతూ మంత్రంగా ముగించి, అధికమొత్తంలో నగదు నొక్కేశారు. మొత్తం కోటి 79 లక్షలు మంజూరు కాగా కోటి 22 లక్షలకు టెక్నికల్ మంజూరు లభించింది. వాటిలో కోటి 22 లక్షలకు పనులు చేయాల్సి వుండగా మొత్తం మీద 20 లక్షల రూపాయల పని కూడా చేశారో లేదో తెలియదు. కానీ నిధులలో కొంత మొత్తం డ్రా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ అధికారులకు ఎటువంటి సంబంధం లేకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వ నిధులు విజయవాడలోని ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ బ్యూటిఫికేషన్ శాఖకు సంబంధించి కొందరు అధికారులే పనులు పర్యవేక్షించారు.

వాకింగ్ ట్రాక్ రహదారి మరమ్మతు, ట్రాక్ చుట్టూ రక్షణ గోడగా రాళ్లతో కూడిన రిబెట్‌మెంట్ ఏర్పాటు, చెరువులో పూడికతీత, పెన్సింగ్ తదితర పనులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోటి 22 లక్షల నిధులతో పూర్తిచేయాల్సి వుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సత్తెనపల్లికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ పని దక్కించుకున్నాడు. ఎన్నికలకు ముందుగా పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ చెరువులో పూడికతీత తీసి తీయనట్లుగా మమ అనిపించాడు. అదేవిధంగా చెరువు చుట్టూవాకింగ్ ట్రాక్‌కు ఓ వైపున రాళ్లతో కూడిన రిబెట్‌మెంట్‌ను పటిష్టపరచాల్సి వుంది. అలా కాకుండా నామ్‌కేవాస్తిగా రాళ్లు ఒకదానిపై ఒకటి పేర్చి అలా వదిలేశారు. చెరువు చుట్టూ పెన్సింగ్ తీగ వేయాల్సి వున్నా కొంతభాగం ఇనుప రాడ్లు వేసి పెన్సింగ్ తీగ వేయకుండానే వదిలేశారు. బ్యూటిఫికేషన్ పేరుతో వచ్చిన నిధుల అజమాయిషీ మొత్తం కూడా విజయవాడకు చెందిన శాఖాధికారులే పర్యవేక్షించడం, స్థానిక అధికారులకు ఏమాత్రం సంబంధం లేకపోవడంతో పనుల నాణ్యతలో డొల్లతనం కనిపిస్తుంది. మొత్తం నిధులలో 68 లక్షలకు పైచిలుకు డ్రా చేసుకోవడం జరిగింది. మరో 44 లక్షల పైచిలుకు కాంట్రాక్టర్ ఖాతాలో జమచేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా వున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, చిలకలూరిపేట పట్టణాలకు ఏపి గ్రీనరీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయగా దాచేపల్లి, పిడుగురాళ్లలో కొంత పనులు చేయగా మిగిలినవి అసంపూర్తిగా వదిలేశారు. వినుకొండ, చిలకలూరిపేటలో పనులు ప్రారంభించాల్సి వుంది.

విచారణ చేయించాలి..

పిడుగురాళ్ల వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను నామమాత్రంగా ఖర్చుచేసి మొత్తం ఖర్చుచేసినట్లు లెక్కలు చూపి చెక్‌లు రాయించుకున్న వైనంపై విచారణ జరపాలని పట్టణ టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రం నిధులు ఇవ్వడం చేతకాకపోయినా కేంద్రం ఇచ్చిన నిధులను కూడా సద్వినియోగం చేయకపోగా వాటిని పక్కదారి పట్టించడం అప్పటి వైసీపీ నేతలు అధికార దుర్వినియోగంకు పాల్పడి నగదును స్వాహా చేసిన ఘటనపై విచారణ కోరనున్నట్లు పట్టణ టీడీపీ నాయకులు, ప్రజాసంఘాలు, వాకర్స్ పేర్కొంటున్నారు.



గతుకుల మయంగా మారిన వాకింగ్ ట్రాక్

పశుసంపద పెంపుపై దృష్టి సారించాలి

● రైతులకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సూచన

● వీరారాధనోత్సవాల్లో రెండో రోజు సేద్యపు విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యే జూలకంటి



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశు సంపద పెంపుపై దృష్టి సారించాలని రైతులకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా స్థానికంగా నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో రెండో రోజైన ఆదివారం సేద్యపు విభాగం ఎడ్ల పోటీలను ఆయన మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పల్నాడు ప్రాంత ప్రజలు పశువులను తమ కుటుంబ సభ్యుల మాదిరి చూసుకుంటారన్నారు. పల్నాటి రైతుల దశాబ్దాల కల వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేయడమే తమ లక్ష్యమన్నారు. తనను రెండోసారి ఎంపీగా గెలిపించిన పల్నాటి ప్రాంత ప్రజలు రుణపడి ఉంటానన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా 900 ఏళ్లగా పల్నాటి వీరారాధనోత్సవాలు నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. ఎడ్ల పోటీలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. అనంతరం వీర్ల దేవాలయ ప్రాంగణంలో కాకతీయ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కోలాట ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కుర్రి శివారెడ్డి, బొల్నేడి శ్రీను, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, గోరంట్ల నాగేశ్వరరావు, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కర్నా సైదారావు, మోదీన్‌సా, బూసా రామాంజినేయులు, గోళ్ల సురేష్ యాదవ్, ఎస్పీఆర్ కృష్ణ, శంకర్, పూర్ణ, రాఘవ, షేక్ జానీబాషా, షేక్ నన్నేసా, తుపాకుల రత్తయ్య, బొల్నేడి హరికృష్ణ, కిలారి పవన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

రెడ్ నోటీసులు జారీ

సత్తెనపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పురపాలక సంఘానికి చెల్లించాల్సిన మొండి బకాయి దారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ షమ్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్ను చెల్లించాల్సిన 40 మంది మొండి బకాయిదారులకు, 18 మంది షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులకు రెడ్, లీగల్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. రూ.5.60 కోట్ల ఆస్తి పన్ను బకాయిలకు గాను శనివారం నాటికి రూ.2.43 కోట్లు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. నీటి కుళాయిల పన్ను బకాయిలు రూ.2.07 కోట్లకు గాను రూ.30 లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు. జనవరి నాటికి నీటి కుళాయిల బకాయిలు చెల్లించకుంటే ఆ ఇంటి కులాయి కనెక్షన్‌ను తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు.



కేశానుపల్లి-తక్కెళ్లపాడు గ్రామాల మధ్య గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్న రహదారి

రోడ్డుపై గోతులను పూడ్చండి

దాచేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేశానుపల్లి - తక్కెళ్లపాడు రహదారి మార్గం గోతులమయంగా మారడంతో నూతన రోడ్డు నిర్మాణం లేకపోయినా కనీసం గోతులను పూడ్చాలని ప్రయాణీకులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు. దాచేపల్లి - కారంపూడి మధ్య ప్రయాణించే వారు ఈ మార్గంలోని గోతులపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. పల్నాడు చరిత్రకు ప్రసిద్ధిగాంచిన కారంపూడి తిరునాళ్ల జరుగుతున్న తరుణంలో ఆచారవంతులు, పల్నాడు ప్రాంతంలోని భక్తులు కారంపూడికి వెళ్లడానికి ఈ మార్గం ఎంతో ఉపయోగకరంగా వుంటుంది. కానీ ఏళ్ల తరబడి ఈ రహదారి నిర్మాణం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఈ రహదారిలో గోతులను పూడ్చాలని కోరుతున్నారు.



జడ్పీ స్కూల్లో సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు

ఆనాటి స్మృతులు మధురం

● ఆత్మీయ సమావేశంలో పూర్వవిద్యార్థులు

పిడుగురాళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఆనాటి స్మృతులు నేటికీ ఎంతో మధురమైన జ్ఞాపకాలని, గురువుల విద్యాబోధనే తమ అభ్యున్నతికి బాటలు వేసిందని జానపాడు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తెలిపారు. 1998-99 10వ తరగతి మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జడ్పీ పాఠశాలలో జరిగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాఠశాలలోని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాడు వీరికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

సభ్యత్వ నమోదుకి ఆర్థికసాయం

పెదకూరపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన పెదకూరపాడులో 50 మంది పేదలకు టీడీపీ సభ్యత్వం తీసుకునేందుకు టీడీపీ నాయకుడు షేక్ మలాట్ రఫీ రూ. 5 వేలు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్‌కు అందజేశారు. నిరుపేదల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఎంతో భరోసా కల్పిస్తుందన్న ఉద్దేశంతో సభ్యత్వ నమోదుకు ఆర్థికసాయం చేసినట్లు రఫీ తెలిపారు. రఫీ లాంటి నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకి బలం అని ఆర్తిమళ్ల రమేష్, వీ. అప్పారావు, ముంతాజ్, షేక్ అజ్మల్లా, పర్వీజ్, సబీర్‌లు కొనియాడారు.

రెంటచింతలకు తహసీల్దారు కావలెను

● ఎంతో కాలంగా ఇన్‌చార్జిలే దిక్కు !

● ఇంకెంతకాలం అధికారుల ద్విపాత్రాభినయం ?

రెంటచింతల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెంటచింతల తహసీల్దారు కార్యాలయంనకు తహసీల్దారు కావాలి. చాలాకాలంగా ఈ పోస్టులో ఇన్‌చార్జులే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వచ్చే ప్రజలు ఆ సమయంలో తహసీల్దారు లేకపోవడంతో నిరాశతో వెను దిరుగుతున్నారు. రెంటచింతల తహసీల్దారుగా గురజాల తహసీల్దారు నగేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎవరికి తెలియకుండా వుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రెంటచింతల తహసీల్దారు పుల్లారావును ఎన్నికల నిమిత్తం తిరుపతికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో



రామమోహనరావును నియమించగా, జూలైలో ఆయన మృతి చెందారు. ఆ తర్వాత కొంతకాలం డీటీ బ్రహ్మయ్యను, ఈయన తర్వాత కరుణకుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. కరుణకుమార్ బదిలీపై పత్తిపాడుకు వెళ్లారు. దీంతో నెలరోజుల నుంచి రెంటచింతల తహసీల్దారు కుర్చీ ఖాళీగా వుంది. అలాగే సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుపోస్టులు ఖాళీగా వున్నాయి. దీంతో ప్రజలురైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అర్బన్ హెల్త్ సెంటరులో
న్యాయ అవగాహన సదస్సు

మాచర్లటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన పట్టణంలోని గౌడ కాలనీ అర్బన్ హెల్త్ సెంటరులో ప్రపంచ హెచ్‌ఐవీ దినోత్సవం సందర్భంగా ఆదివారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. మాచర్ల సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాస కళ్యాణ్ పలు చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఏజీపీ జి వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న, న్యాయవాదులు అనిల్‌కుమార్, వరప్రసాద్, గోవిందరెడ్డి, ఎస్‌ఐ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

విత్తన శుద్ధిపై అవగాహన

ముప్పాళ్ళ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : 'గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదల గ్రామంలో రైతులకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విత్తనశుద్ధి కేవలం పురుగు మందులు, తెగుళ్ళ మందులే కాకుండా జీవన ఎరువులతో చేయటం వలన అధిక దిగుబడులు వచ్చి రైతులకు లాభాలను తెచ్చిపెడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు కే.అఖిల, ఆర్య హరి, జీ.చైత్రిక, షేక్ ఆయేషా, టీ.భువనేశ్వరి, టీ.శ్వేత, కే.దివ్య ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

నకరికల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పెద్ద చావిడి వద్ద ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నేతలు ప్రారంభించారు. వంద రూపాయలు చెల్లించి టీడీపీ సభ్యత్వం పొందిన కుటుంబాలకు భద్రత, భరోసా లభిస్తుందన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన చేసే టీడీపీని బల పరచాలని నేతలు కోరారు. కార్యక్రమంలో బండా జైనుల్లా, ముని, షరీఫ్, వెంకట్రామయ్య, వెంకటేశ్వర్లు, అంజి తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత గ్రంథాలను బహుకరిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధకులు

దీపారాధన
యోగ సాధనకు గుర్తు

రెంటచింతల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపారాధన యోగ సాధనకు గుర్తు అని, కార్తీక మాసంలో గృహాల ముందు దీపాలను వెలిగించడం జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పాలువాయి, తుమ్మకోట గ్రామాల్లో కార్తీక మాసం ముగింపును పురస్కరించుకొని భగవద్గీత గ్రంథాలను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మజ్ఞానానికి గుర్తు అని అన్నారు. గురువు ఇచ్చిన జ్ఞానం ఆరిపోకుండా వెలిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలుకలూరిపేట కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, వై వీరాంజనేయులు, కే. అరుణ, కార్తీక్, వెంకట్రామిరెడ్డి, రామాంజినేయులు, అనురాధ, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస పూజలు

రెంటచింతల,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :పవిత్రమైన కార్తీకమాసం ఆదివారంతో ముగిసింది. నెల రోజుల పాటు వివిధ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. భక్తులు పవిత్రస్నానాలు చేసి ఇష్టదైవాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యేలు ప్రవీణ్, గళ్లా మాధవి

పేద విద్యార్థులకు చేయూత నివ్వాలి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభకల్గిన విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూత నిచ్చి, అండగా నిలబడాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం గుంటూరు నగరంలోని చంద్రమౌళినగర్ భాష్యం పాఠశాల ఆవరణలో కొండవీటి పాపయ్య, చిన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొండవీటి నరసింహారావు, పాపారావు, కిషోర్ బాబు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కొండవీటి నరసింహారావు చేసిన సేవలు స్ఫూర్తి దాయకమన్నారు. చంద్రబాబు నాయుడు, లోకేశ్ రాష్ట్రంలోని విద్యావ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఉపకార వేతనాలు పొందినవారు ఉన్నత స్థాయికి ఎదిగి పేద విద్యార్థులకు చేయూత నివ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పెదకూరపాడుకు చెందిన 42 మంది విద్యార్థులకు రూ.1లక్షల 50 వేల విలువ కల్గిన ఉపకారవేతనాలు భాష్యం ప్రవీణ్ చేతుల మీదగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండవీటి పాపయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీకే రావుకు ఎమ్మెల్యే ప్రవీణ్ నివాళి

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి చల్లా కోటేశ్వరరావు(సీకే రావు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సీకే రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీకే రావు భార్య టీడీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు చల్లా అనూపకళను పరామర్శించి సానుభూతి తెలిపారు. తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, గంధం కోటేశ్వరరావు, మొక్కపాటి గిరిబాబు, కొలగాని సత్యనారాయణ, తిరువాయిపాటి ఆంజనేయులు, తాళ్ళూరి సుబ్బారావు, సందెపోగు సామేలు, నల్లగట్ల సత్యం తదితరులు ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే ప్రవీణ్ పూజలు

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) మండల పరిధి లోనిముత్తాయపాలెం గ్రామంలో కొలువై వున్న నిదానంపాటి ప్రసన్నలక్ష్మీ ఆలయంలో అమ్మవారి 34వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పూజలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ నిర్వాహకులు ఎమెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కుంకుమపూజ, హోమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చిరుమామిళ్ల జానకీరామయ్య, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీ ఆలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

రాములునాయక్ మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు మెంబరు రాములు నాయక్ మృతి పార్టీకే తీరని లోటు అని టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంకొండలో రాములు నాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ గతంలో రాములు నాయక్ బెల్లంకొండ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరుపున వార్డు మెంబరుగా పోటీ చేసి గెలుపొందారని గుర్తుచేశారు. రాములు నాయక్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నివాళులర్పించిన వారిలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ కొండవీటి రజాక్, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, సుభానీ, పెద్ద హయాం, ఎన్ పిచ్చయ్య, బాలాజీ నాయక్, నాగేశ్వరరావు నాయక్, అహమ్మద్, సలాం పాల్గొన్నారు.





కండ్లకుంటలో ఇష్టకామేశ్వర స్వామి, నరసింగపాడు కోనేరులో తెప్పోత్సవం

ఇష్టకామేశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకం

● పలు ఆలయాల్లో కార్తీకమాసం అమావాస్య సందర్భంగా పూజలు

నకరికల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కండ్లకుంటలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత ఇష్ట కామేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం, అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో ఇష్ట కామేశ్వర స్వామికి అభిషేకాలుచేశారు. ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ సహస్ర నామార్చన నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఇష్టకామేశ్వర స్వామి కాలకేయ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను పారిశ్రామిక వేత్త రావెల సత్యనారాయణ, రావెల లింగయ్య చౌదరి, సర్పంచ్ రావెల సాయి నవీన్ కుమార్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద కోడెల అబ్బయ్య, మాజీ సర్పంచ్ పమిడి రామయ్య, రాయిడి సాంబశివరావులు, గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్నదానం చేశారు.

నరసింగపాడులో కార్తీక మాసం ఆదివారం అమావాస్య రోజు లక్ష బిల్వార్చన ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, అనంతరం అన్నాభిషేకం చేశారు. అన్నాపూర్ణదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. అయ్యప్ప సహిత గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త శ్రీనివాసశర్మ నిర్వహించారు.

వైభవంగా తెప్పోత్సవం..ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నరసింగపాడులోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం వద్ద కోనేరులో హంస వాహనంపై కొలువుదీరిన కాశీవిశ్వేశ్వరస్వామి తెప్పోత్సవం వైభవంగా ఆదివారం రాత్రి సాగింది. భారీ బందోబస్తు నడుమ తెప్పోత్సవ ఉత్సవం, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి గ్రామంలో వేంచేసియున్న నాగేశ్వర సహిత గంగాపార్వతి సమేత ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చండీ హోమంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో తంగెళ్ల శ్రీను, బెల్లంకొండ భద్రి, మునగా నిమ్మయ్య, నర్రా పుల్లయ్య, పగడాల బాస్కర రావు, కొప్పుల గిరి, బొమ్మిరెడ్డి సత్యం, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడు నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని పట్టుచీర, నిమ్మకాయలు, పూలు, గాజులతో అలంకరించారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, మహన్యాసం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. క్రోసూరులోని పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం

నరసరావుపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కల్యాణ వేంకటేశ్వరస్వామికి, కామేశ్వరస్వామికి, పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు గడువు పెంపు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి గత నెల 6వ తేదీన ఓట్ల నమోదు ముగిసిన నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియలో పలు సాంకేతిక కారణాలతో వేల సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, పలు అభ్యంతరాలు పార్టీ దృష్టికి వచ్చాయని రాష్ట్ర తెలుగుదేశం ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్ళగా డిసెంబరు 9వ తేదీవరకు అర్హులైన పట్టభద్రులు మరలా నూతనంగా దరఖాస్తు చేసుకోవటానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ప్రత్తిపాటి తెలిపారు. పార్టీ కార్యాలయంలో, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా అందుబాటులో ఉంచామని, ప్రతి ఒక్కరూ ఆ జాబితాను పరిశీలించి లిస్టులో పేరులేని వారు మరలా ఓటు నమోదుకు ఫారం-18 దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు అందరూ వినియోగించుకోవాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు.

'పేట'లో 11వేల మందికి పెన్షన్ల పంపిణీ

చిలకలూరిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 29 సచివాలయాల పరిధిలో ఉన్న మొత్తం 11,062 మంది పెన్షనర్లు ఉన్నారని, వారికి రూ.4.75 కోట్లు మొత్తాన్ని సామాజిక పెన్షన్లను పంపిణీ చేసినట్టు మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు ఆదివారం చెప్పారు. చిలకలూరిపేట మండలం పరిధిలో రూ.3.59 కోట్లు మొత్తాన్ని 15 సచివాలయాల పరిధిలో 22 గ్రామాలలో ఉన్న ఉన్న 8,600 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

తేళ్ళ సుబ్బారావు మాతృమూర్తి కన్నుమూత

చిలకలూరిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కాకతీయ కమ్మ సత్ర సంఘం, చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు, స్థానిక మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు అయిన తేళ్ళ సుబ్బారావు తల్లిగారైన శ్రీహరమ్మ (95) ఆదివారం ఇక్కడ వారి స్వగృహంలో కన్నుమూశారు. చిలకలూరిపేటలో సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీహరమ్మ మృతిపై స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం ప్రకటించారు. శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ శ్రీహరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పలువురు పట్టణ ప్రముఖులు, రోటరీ క్లబ్ సభ్యులు, నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఇసప్పాలెం మహంకాళి అమ్మవారు

మహంకాళి ఆలయంలో విశేష పూజలు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి దేవస్థానంలో కార్తీకమాసం అమావాస్య ఆదివారం సందర్భంగా అమ్మవారికి విశేష పుణ్యతిథి కావడంతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు మహా చండీహోమం విశేష పుష్పాలంకరణ నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎన్.మాధవిదేవి తెలిపారు. నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి (108) నిమ్మకాయల మాలను అమ్మవారికి సమర్పించారు. పదిమంది ఉభయ దాతలు ప్రత్యక్షంగా చండీహోమంలో పాల్గొన్నారు ఆదివారం సుమారుగా 5000మంది అమ్మవారిని దర్శించుకున్నారు సుమారు 1500మంది అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

● బెజ్జం సంపత్‌బాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బెజ్జం సంపత్‌బాబు ఆదివారం డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐల మినహాయింపుల రూపంలో దాదాపు రూ.2500కోట్లు ప్రభుత్వానికి చేరిందన్నారు. కనీసం వాటినైనా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు మంజూరు చేసి అత్యవసర అవసరాలకు ఆదుకోవాలన్నారు. పన్నెండో పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించి 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. సరెండర్ లీవు ఎన్ క్యాష్‌మెంట్లను తక్షణమే మంజూరు చేయాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల ఒత్తిడిని తగ్గించాలని ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై డిసెంబరు 20న పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దర్నా చేస్తామని చెప్పారు.

మునిగిన పంట పొలాలు

● ఉధృతంగా పెరుమాళ్ళపల్లి మేజర్ కాల్వ
● పరిమితికి మించి నీటి ప్రవాహం
● అక్రమ తూములతో నీరంతా వృథా



ఉధృతంగా కాల్వ అంచుల వరకు ప్రవహిస్తున్న పెరుమాళ్ళపల్లి మేజర్ కాల్వ, మునిగిన పొగాకు పంట పొలాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపల్లి మేజర్ కాల్వలో పరిమితి మించిన నీరు ప్రవహించడంతో పొలాల్లోకి నీరు నిలిచింది. అక్రమ తూముల కారణంగా నీరంతా వృథా అవుతోంది. సింగరు చెరువుకు నీరు ప్రవహించి అడ్డీల వద్ద పెరుమాళ్లపల్లి మేజర్ కాల్వ నీరు పొలాల్లోకి ప్రవహించడంతో అక్కడ ఉన్న పొగాకు పంట పొలాలు నీట మునిగాయి. విష్ణుకుండినగర్ నుంచి జాలలపాలెం వరకు మేజర్ కాల్వలపై ఏర్పాటుచేసిన అక్రమ తూముల కారణంగా నీరు ముందుకు ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో అక్రమ తూములకు నీరు ఎగదన్ని కాల్వల ద్వారా నీరు పంట పొలాల్లోకి వచ్చి చేరింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులకు నీటిఎద్దడి లేకుండా పోయింది. అయితే కాల్వల్లో నీరు అధిక ప్రవాహం కారణంగా అక్రమ తూములతో తడిచిన పొలాలు మరలా తడవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. అంతేకాకుండా సిబ్బంది కొరత కారణంగా కాల్వల్లో ప్రవాహం పరిస్థితిని పరిశీలించకపోవటం, అడ్డీలను తొలగించకపోవటంతో నీరు ఎక్కువగా విడుదలై కట్టలు దాటి ప్రవహిస్తోంది. ప్రధానంగా అక్రమ తూములను అరికట్టకపోవడంతో నీరంతా వృథాగా ప్రవహిస్తోంది. ఇప్పటికైనా ఎన్ఎస్‌పీ అధికారులు కాల్వపై నీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి వృథాను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

వినుకొండలో బ్రాహ్మణ భవనం నిర్మిస్తాం

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వంగవీటి మోహనరంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో త్వరలోనే బ్రాహ్మణ భవన నిర్మాణం చేస్తామని, బ్రాహ్మణ పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం బ్రాహ్మణ కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ముందుగా శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల కార్తీక వనసమారాధన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, వినుకొండ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని, వారి అభివృద్ధి ఆకాంక్షలు నెరవేర్చేలా ముందుకు సాగుతామన్నారు. కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి గుడి నిర్మాణం, మెట్ల మార్గం పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. టీటీడీ కల్యాణ మండపం, ఎన్ఎస్‌పీ స్థలంలో క్రికెట్ మైదానం నిర్మాణంతోపాటు అపరకర్మల సత్రం నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. బ్రాహ్మణ భవనం నిర్మాణం కోసం సీఎంతో మాట్లాడి నిధులు తీసుకువస్తానన్నారు. బ్రాహ్మణ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం సంఘం తరపున రూ.5లక్షలు వసూలు చేస్తే తాను రూ.50వేలు కలిపి పేదలకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఇళ్ళులేని బ్రాహ్మణులకు సంఘపెద్దల విజ్ఞప్తి మేరకు టిడ్కో ఇళ్ళు అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ పెద్దలను జీవీ సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్, శివశక్తి మేనేజర్ జీవీ రమణారావు, పీవీ సురేష్, గాలి శ్రీనివాసరావు, భాగవతుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అండగా ఉంటా..

వినుకొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పేద కాపు విద్యార్థులకు అండగా ఉంటానని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని మదమంచిపాడు వీరాంజనేయ స్వామి దేవస్థాన ఆవరణలో కాపు సంఘీయుల కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముందుగా వంగవీటి మోహనరంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలో వంగవీటి మోహనరంగ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ కాపులు ఐక్యంగా ఉండాలన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నీతివంతమైన పాలన ప్రజలకు అందించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జనసేన అధికారి ప్రతినిధి శివపార్వతితో పాటు టీడీపీ, జనసేన పార్టీలోని నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వన సమారాధన వైభవంగా జరిగాయి. కార్తీక మాసం ఆఖరి ఆదివారం కావటంతో పలు ప్రాంతాల్లోని ఉసిరి తోటల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధనలో మహిళా భక్తులు ఉసిరి చెట్లకు పూజలు నిర్వహించారు. కోటప్పకొండ మార్గంలోని ఉసిరి తోటలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ తదితర సంఘాలు సమారాధన నిర్వహించాయి. ఈ సందర్భంగా పురుషోత్తపట్నం వారు ఏర్పాటు చేసిన నాదెండ్ల గ్రామానికి చెందిన అన్నమయ్య సంకీర్తన సాయి బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. పోలిరెడ్డిపాలెంలోని శ్రీ సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన కార్తీక భోజనాల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీడబ్ల్యూజే నిర్వహించిన వన సమారాధనలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పుల్లగూర భక్తవత్సలరావు, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్‌వలి, అల్లాభక్షు, అధ్యక్ష, కార్యదర్శులు అన్నలదాసు గిరి, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని గుర్రపునాయుడు పాలెంలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీరామమోహన్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీ సీతారామ స్వామి, సీతాలాంబ దేవి (బొడ్డురాయి), గ్రామదేవత పోలేరమ్మతల్లికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు.



భక్తి గీతాలు ఆలపిస్తున్న నాదెండ్ల మహిళలు

ప్రపంచ ఎయిడ్స్ డే ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నరసరావుపేట లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల నర్సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల వద్ద ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ప్రతి ఏడాది డిసెంబరు 1న నిర్వహిస్తారన్నారు. ఎయిడ్స్ బాధితుల మానసిక ఆరోగ్యానికి మద్దతుగా నిలిచి ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ర్యాలీ పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల నుంచి గడియార స్తంభం వరకు నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ సెంటర్లో విద్యార్థినీ, విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలను పల్నాడు బస్టాండ్ సెంటర్లో నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల జాయింట్ సెక్రటరీ పీ శ్రీనివాసప్రసాదు, నర్సింగ్ విద్యార్థులు, ఎన్జీవో ప్రతినిధులు, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ డాక్టర్ దయానిధి ఆర్ఎంవో డాక్టర్ ఏడుకొండలు సేవా సంస్థ ప్రతినిధులు, సయ్యద్ మహమ్మద్ గౌస్, ఆశా వర్కర్లు ఐసీటీసీ కౌన్సిలర్లు ల్యాబ్ టెక్నీషియన్లు నర్సింగ్ విద్యార్థులు వివిధ ప్రాజెక్టుల సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 1: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని విట్ కళాశాలలో స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సరావుపేట ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమ హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకూడదన్నారు. వారికి చట్టపరంగా ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాలను, న్యాయసాయంపై వివరించారు. కార్యక్రమంలో మొదటి పట్టణ పోలీసులు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ దిశ పోలీస్ స్టేషన్ పరిపాలన అధికారి, శ్రీనివాసరాజు, ఉదయరాజు, మేరీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేయటం అభినందనీయమని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మానుకొండవారిపాలెంలో పార్టీ నేత కల్లి వీరారెడ్డి, ఎల్‌వీ ప్రసాదు నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి 150మంది పరీక్షల నిమిత్తం హాజరు కాగా వీరిలో 70మంది కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. వారికి సోమవారం కారంచేడులోని ఎల్‌వీ ప్రసాదు నేత్రవైద్యశాలలో చికిత్సకు తీసుకువెళ్ళటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మరో 500 మందికి కళ్ళజోళ్ళ అవసరం ఉంటుందని, మరోమారు పరీక్షలు జరిపి వీరికి కళ్ళజోళ్ళు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.సత్యనారాయణరెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, ఎం. రవీంద్రారెడ్డి, ఎం.రామిరెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, ఎం.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరవట్నంలో 257 మందికి...

రొంపిచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవట్నంలో చల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో నరసరావుపేట ఎంవీ రెడ్డి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ప్రారంభించారు. 257మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 17మందికి శుక్లాలు, 12 మందికి కంటి పొరలు ఉన్నట్టు గుర్తించారు. అవసరమైన వారికి శుక్లాల మందు, కళ్ళజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాష్టి ప్రసాదు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీరవట్నంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

మెగా డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల

ఖాళీలను భర్తీ చేయాలి



ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోటమరాజు, ఎం వెంకట నాయుడు, శిరీష, రవి తదితరులు పాల్గొన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.



టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చైర్మన్

టిడ్కో గృహ సముదాయాన్ని తీర్చిదిద్దుతాం

● టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యుత్తమ గృహ సముదాయంగా చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయాన్ని శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో తీర్చిదిద్దుతామని రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం టిడ్కో నివాస సముదాయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలసి అజయ్ కుమార్ పరిశీలించారు. అలాగే గృహ సముదాయంలో నివశిస్తున్న లబ్ధిదారులతో కూడా వారు మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ సమస్యలను వివరించారు. మంజూరు పత్రాలు ఉన్నప్పటికీ గృహాలు తమకు అప్పగించలేదని, కొందరు తమ పేరుతో మొదట మంజూరైన గృహం ఇప్పుడు వేరొకరి పేరుపై ఉండటం వంటి అంశాలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అసంపూర్తిగా మిగిలిన గృహాల వైపు నుంచి పాములు వస్తున్నాయని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం, ఇక్కడే పింఛన్ తీసుకొనే వెసులుబాటు కల్పించాలని కోరారు. అన్ని వసతులు ప్రాధాన్య క్రమంలో తీసుకురావటం జరుగుతుందని ప్రత్తిపాటి, అజయ్ కుమార్‌లు వారికి హామీ ఇచ్చారు. సముదాయంలో శాంతి భద్రతల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మునిసిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, టిడ్కో ఎస్ఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయనిధి: జీవీ

వినుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరంలో ఆపదలో సాయాన్ని కూడా బాధ్యతగా అందిస్తున్న ప్రభుత్వం తమదేనని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన చల్లా పద్మ సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహకారాన్ని ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్బయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



బొమ్మరాజుపల్లిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

రైతులకు వరం ప్రకృతి వ్యవసాయం

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

ఈపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని.. ఇది రైతులకు వరమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి అన్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లి, ఈపూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆదివారం ఆమె సందర్శించారు. అక్కడ జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పండ్ల తోటల్లో అంతర పంటలు పండించడం వల్ల రైతులకు లాభాలు రావడంతో పాటు భూమి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. వరి పండించే రైతులు గట్లపైన పండ్లు, ఆకుకూరలు వేసుకోవడం వల్ల కొంతమేర పెట్టుబడి రాబట్టుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, తిరుపతిరావు, భాస్కరరావు, వీరాంజనేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.